నవతెలంగాణ
1
ఆదిలాబాద్
గురువారం | జులై 25, 2024 | www.navatelangana.com

చిరుత దాడిలో మేక మృతి

నవతెలంగాణ-తలమడుగు

కొత్తూరు గ్రామానికి చెందిన బోరుగుల స్వామికి చెందిన మేక బుధవారం గ్రామ సమీపాన చిరుత పులి దాడిలో మృతి చెందింది. మేకలపై తరచూ చిరుత దాడి చేస్తుండడంతో ఇప్పటి వరకు సుమారు 30 వేల వరకు నష్టపోయినట్లు స్వామి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రెండు నెలల నుండి కొత్తూరు చెరువు ప్రాంతంలో రెండు చిరుతలు తిరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ ప్రజలకు, పశువులు, మేకల కాపరులకు ఎలాంటి సూచనలు, సలహాలు ఇవ్వడం లేదని తెలిపారు. అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకొని చిరుతల నుండి పశువుల తో పాటు మనుషుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఇప్పటి వరకు మూడు మేకలు చిరుత దాడిలో మరణించినప్పటికీ అటవీశాఖ అధికారులు నష్టపరిహారం అందజేయలేదని తెలిపారు.



విత్తన దుకాణాలు తనిఖీ

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండల కేంద్రంతో పాటు లోకారి గ్రామంలోని విత్తన దుకాణాలను బుధవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తనిఖీ చేశారు. రసాయన మందులు, ఎరువుల గోదాములను పరిశీలించారు. దుకాణంలో స్టాక్ పట్టిక, రశీదు, రికార్డులు పరిశీలించారు. నిల్వ ఉన్న యూరియా, డీఏపీ, పొటాష్ ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తూ డీలర్లు సరైన సమయంలో రైతులకు ఎరువులు అందేటట్లు పంపిణీ చేయాలన్నారు. ప్రతి రైతుకు ఆధార్ లింక్‌తో ప్రభుత్వ ధరకు మాత్రమే ఎరువులు, మందులు ఇవ్వాలన్నారు. రైతులెవరైన ఫిర్యాదు చేస్తే దుకాణ లైసెన్స్ రద్దుచేసి యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిల్వ ఉన్న ఎరువులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ రికార్డు చేయాలన్నారు. ఆయన వెంట ఏఓ దివ్య, ఏఈఓలు ఉన్నారు.

ఏకధాటి వర్షం..!

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ప్రాణహిత పరివాహక ప్రాంతంలో పంటలకు నష్టం
- నిండుకున్న ప్రాజెక్టులు..దిగువకు నీటి విడుదల
- సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి
- స్తంభించిన జనజీవనం..కొనసాగుతున్న వర్షం



నిండిన కడెం ప్రాజెక్టు

ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా కురుస్తున్న వానలతో జనజీవనం స్తంభించిపోయింది. మంగళవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం బుధవారం రాత్రి వరకు కొనసాగింది. క్షణం తెరిపి లేకుండా కురుస్తుండటంతో రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. మరోపక్క సాగునీటి ప్రాజెక్టులు నిండను తలపించగా.. ఎగువ నుంచి అధిక వరద రావడంతో కొన్ని గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. మరోపక్క ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతంలోని పంటలు నీట మునిగాయి. మంచిర్యాల ప్రాంతంలోని సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ(మట్టి తీయడం) ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతుండటంతో లోలెవల్ వంతెనలు దాటలేక రవాణ వ్యవస్థ స్తంభించిపోయింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం కూడా వర్షం కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా వర్షాల జోరు కొనసాగుతోంది. విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో అనేక చోట్ల పంటలకు మేలు జరుగుతుండగా..నదులు,వాగుల పరివాహక ప్రాంతాల్లో మాత్రం పంట పొలాల్లోకి వరద నీరు రావడంతో మొక్కలు వాడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కొన్ని చోట్ల వరద తాకిడికి కొట్టుకుపోగా.. మరికొన్ని చోట్ల నీటిలో మునిగిపోయాయి. మరోపక్క ఇన్నాండ్లు నీరు లేక బోసిపోయిన సాగునీటి ప్రాజెక్టులు నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి. కొన్ని ప్రాజెక్టుల్లో నిల్వ సామర్థ్యం మేరకు నిండుకోవడం..ఎగువ నుంచి వరద నీరు అధికంగా వస్తుండటంతో ముందుజాగ్రత్తగా కొన్ని ప్రాజెక్టులకు సంబంధించి గేట్లును ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడం మూలంగా వంతెనల నిర్మాణం లేని చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. లోలెవల్ వంతెనలపై ప్రమాదకరంగా నీరు ప్రవహిస్తుండటంతో పలు చోట్ల వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయి రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల రోడ్లు,లోలెవల్ వంతెనలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోగా..తాజాగా పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

నీట మునిగిన పంటలు..!

ఉమ్మడి జిల్లా సరిహద్దున ప్రవహిస్తున్న ప్రాణహిత నది ఎగువ నుంచి వరదతో మరింత ఉగ్రరూపం దాల్చింది. ఉప్పొంగి ప్రహిస్తుండటం కారణంగా దహెగాం మండలంలోని దిగిడ, రాంపూర్, మొస్లగూడ, రావులపల్లి తదితర గ్రామాల్లోని పంటలన్ని నీట మునిగాయి. వీటితో పాటు బెజ్జూర్, వేమనపల్లి, కోటపల్లి, పెంచికల్‌పేట మండలాల్లోని నదీ సరిహద్దు గ్రామాల్లోని పంటలన్ని వరదపాలయ్యాయి. మరోపక్క కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. కుమురంభీం(అడ) ప్రాజెక్టు సైతం పూర్తిస్థాయిలో నిండుకోవడంతో నాలుగు గేట్లు ఎత్తి 3వేల క్యూసెక్కుల నీటిని వదిలిపెడుతున్నారు. భారీ వర్షాల కారణంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేస్తున్నారు. పలు వాగుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో ఏర్పాటుచేసిన డీడీఆర్ఎఫ్ బృందాలను సైతం సిద్ధంగా ఉంచారు. మరోపక్క ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లపై వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఎక్కువ మంది జనాలు ఇండ్ల నుంచి బయటకు రాలేకపోవడంతో వ్యాపారాలు నష్టపోవాల్సి వచ్చింది.

నిలిచిన బొగ్గు ఉత్పత్తి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిలో రోజూ 12వేల మెట్రిక్‌టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోగా.. ఇందారం ఓపెన్‌కాస్ట్‌లో నీళ్లు నిండుకోవడంతో బొగ్గుతో పాటు మట్టి తీయడం(ఓబీ) ప్రక్రియ కూడా నిలిచిపోయింది. ఇది వరకు కురిసిన వర్షాలకు సైతం ఇక్కడ బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది.



శ్రీరాంపూర్ ఏరియా ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి



దహెగాంలో నీట మునిగిన పత్తి పంట



ఓసీపీలో నిలిచిపోయిన బొగ్గు టిప్పర్లు

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అసంపూర్తి పనులు పూర్తి చేయాలి



జైపూర్ : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అసంపూర్తి పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ గణపతి ఆదేశించారు. బుధవారం మండల పరిధిలో గల వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. పెగడపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. కేంద్రాలకు వచ్చే పిల్లలకు సమయానుగుణంగా పౌష్టికాహారం అందించాలని, విద్యార్థుల శాతం పెంచాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఎల్కంటి గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో ఒక్క పిల్లవాడు మాత్రమే ఉండటంతో పిల్లలను అధిక సంఖ్యలో చేర్పించాలని సూచించారు. షెట్‌పల్లి గ్రామంలో గల అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యుత్ సరఫరా, మూత్రశాలలకు సంబంధించిన పనులు అసంపూర్తిగా ఉండటం బాధాకరమన్నారు. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. పరిసరాలను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం వసతుల కల్పనను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

స్మితా సభర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలి



నిర్మల్ : వికలాంగులను కించపరిచిన ఐఏఎస్ స్మితా సభర్వాల్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని, తక్షణమే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎన్‌పిఆర్‌డి జిల్లా అధ్యక్షులు ఫసియుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం సీఐకి ఆమెపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్ వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారని తెలిపారు. అది ఐక్య రాజ్యా సమితి హక్కుల ఒప్పంద పత్రం 2016 ఆర్‌పిడబ్ల్యూడి చట్టంలో పేర్కొన్న సమానత్వం, వికలాంగుల పట్ల వివక్షతకు పూర్తి భిన్నమైందని తెలిపారు. వికలాంగులను అగౌరవపరిచేందుకు ప్రయత్నం చేసిన ఆమెపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు గంగారాం పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సహాయ కేంద్రాలు

జైపూర్ : కలెక్టర్ ఆదేశాల మేరకు భూసమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి పోర్టల్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం భీమారం, జైపూర్ మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లను ప్రారంభించారు. మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకునే ముందు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో సమస్య పరిష్కారం కోసం ఏ మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సలహాలు తీసుకోవాలని తహసీల్దార్ వనజారెడ్డి, సదానందం తెలిపారు. ముందస్తు సమాచారంతో దరఖాస్తు చేసుకోవడం ద్వారా సమస్య పరిష్కారానికి వీలవుతుందని తెలిపారు.

భీమారం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు

నవతెలంగాణ-జైపూర్

జైపూర్ ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణగౌడ్ బుధవారం భీమారం ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. భీమారం ఎంపీడీఓ రాధారాథోడ్ ఇటీవల బదిలీపై వెళ్లడంతో సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ సత్యనారాయణను సిబ్బంది, భీమారం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బెల్లకొండ నరేందర్ శాలువాలతో సన్మానించారు.

సంక్షేమ పథకాలపై ట్రైనీ కలెక్టర్ ఆరా

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో బుధవారం ట్రైనీ కలెక్టర్ అభీగ్యాన్ మాలవియర్ ప్రభుత్వ శాఖల వారీగా అమలు చేసిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, విజయ్‌నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వం ఆసుపత్రిలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, గర్భిణులు, బాలింతలకు, రోగులకు అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిడిపిఓ శారద, సూపర్వైజర్ లక్ష్మీ, వైద్యసిబ్బంది, అంగన్వాడి టీచర్ ఉన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

జైపూర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలు బుధవారం భీమారం, జైపూర్ మండల కేంద్రాలలో ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. భీమారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

కుంటాల జలపాతాన్ని సందర్శించిన బీట్ ఆఫీసర్ల బృందం

నేరడిగొండ : మండలంలోని కుంటాల జలపాతాన్ని బీట్ ఆఫీసర్ల బృందం బుధవారం ఎసీడీ రామ్మోహన్ ఆధ్వర్యంలో సందర్శించారు. బృందంలో 21 జిల్లాలకు చెందిన వారు ఉన్నారని ఎఫ్ఆర్ఓ గణేష్ తెలిపారు. టూర్‌లో భాగంగా ఇక్కడికొచ్చారన్నారు. సిరిచెల్మ అటవీ శాఖ రేంజ్ అధికారి గణేష్ వారికి జలపాతం వివరాలు తెలిపారు. అటవీ రక్షణపై అవగాహన కల్పించారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

కుభీర్ : మండలంలోని పల్సి గ్రామ శివారు ప్రాంతంలో బుధవారం పక్కా సమాచారం మేరకు పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.23,350 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రవీందర్ తెలిపారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు పదార్థాలు, మద్యం, పేకాట కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

జర్నలిస్టులపై బెదిరింపులు, భౌతిక దాడులు అరికట్టాలి

- ఎస్పీకి జర్నలిస్టు జేఏసీ వినతి
- కాంగ్రెస్ నాయకుడు కందిపై ఫిర్యాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజకీయ పార్టీలకు, నాయకులకు వత్తాసు పలకకుండా నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై కొందరు నాయకులు బెదిరింపులు, భౌతిక దాడులు దిగేందుకు యత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలను అరికట్టాలని జర్నలిస్టు జేఏసీ కన్వీనర్ నూక దేవేందర్ కోరారు. ఈ విషయమై బుధవారం ఎస్పీ గౌస్ ఆలంను డీపీఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలోని పలువురు జర్నలిస్టులకు కేసులు నమోదు చేస్తామని బెదిరించిన ఘటనలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. తాజాగా టీవీ 9 స్టాఫ్ రిపోర్టర్ నరేష్‌పై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చంపుతానంటూ బెదిరింపులకు పాల్పడడంతో పాటు తమ పార్టీ అనుచరులను సదరు జర్నలిస్టు ఇంటి ఆచూకీ తెలుసుకునేందుకు పంపినట్లు సమాచారం రావడంతో ఎస్పీని కలిసి ఇలాంటి ఘటనల గురించి వివరించారు. జర్నలిస్టులు రాసిన వార్తలలో అవాస్తవముంటే న్యాయపరంగా లీగల్ నోటీసులు పంపాలి, పరువు నష్టం దావా వేయాలి, ఇలా కాకుంటే మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించాలి, కానీ ఇలా వార్తలు రాసే జర్నలిస్టులను బెదిరించడం, భౌతిక దాడులకు ప్రయత్నించడం ఏ మేరకు సమంజసమని ఎస్పీకి వివరించారు. ఏ జర్నలిస్టు కుల మత, రాజకీయాలకు సంబంధం లేకుండా వార్తలు రాస్తారని, అలాంటి వారికి కులం అంటగడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ బద్నాం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించి ఘటనపై సరైన విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ జేఏసీ కో కన్వీనర్ వెంకటేష్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు, రిపోర్టర్లు, ఫొటోగ్రాఫర్స్, కెమెరామెన్‌లు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో ఎస్పీకి వివరాలు తెలియజేస్తున్న జర్నలిస్టులు

భైంసా : ఆదిలాబాద్ టీవీ9 స్టాఫర్ నరేష్‌ను బెదిరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆయన అనుచరులపై చర్య తీసుకోవాలని టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు పుప్పాల దేవిదాస్, టియుడబ్ల్యూ జే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాజకీయ వార్తలు రాస్తే ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వారిపై తక్షణమే పోలీసులు కేసు నమోదు చేసి చర్య తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



భైంసాలో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఏకధాటిగా వర్షం..
తడిసి ముద్దవుతున్న గ్రామాలు

- పెగడపల్లిలో కూలిన ఇంటి గోడ

నవతెలంగాణ-జైపూర్

నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో గ్రామాలన్నీ తడిసి ముద్దవుతున్నాయి. వర్షాలతో తడిసిన ఇంటి గోడలు, ప్రహరీగోడలు పడిపోతున్నాయి. బుధవారం తెల్లవారు జామున పెగడపల్లి గ్రామానికి చెందిన రామగిరి రాజమ్మ ఇంటి గోడ కూలింది. ఈ సమయంలో రాజమ్మ ఇంట్లో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొంత కాలం క్రితం రాజమ్మ భర్త మృతి చెందగా ఆమె కుమారుడు ఉపాధి కోసం మంచిర్యాలలో ఉంటూ కూలీ పని చేసుకుంటున్నాడు. ఇల్లు తప్ప ఇతర ఆస్తిపాస్తులు ఏమీ లేవు. ఇంటి గోడలు కూలిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని రాజమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. కూలీనాలీ చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె అభ్యర్థిస్తోంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో తడిసిపోయిన ప్రహరీ గోడలు, ఇంటి గోడలు కూలిపోతున్నట్లు గుర్తించామని తహసీల్దార్ వనజారెడ్డి తెలిపారు. బుధవారం తెల్లవారుజామున పెగడపల్లిలో రామగిరి రాజమ్మ ఇంటి గోడ కూలినట్లు సమాచారం అందిందన్నారు. ఇప్పటి వరకు ప్రహరీ, ఇంటి గోడలు కూలిన వారి వివరాలు సేకరించి జిల్లా అధికారులకు నివేదిస్తున్నామని పేర్కొన్నారు. పాత ఇండ్లలో నివాసముండకుండా సురక్షితమైన ఇంటిలో ఉండాలని, మొండి గోడలు, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

వీడీసీ ఆధ్వర్యంలో బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-భైంసా

మండలంలోని వలేగాం గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా బదిలీపై వచ్చిన వారిని సైతం సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దిగంబర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. తమ గ్రామంలో పనిచేసి విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనసూయ పోతన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముధోల్ : బదిలీపై వెళ్లిన, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతో పాటు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులను బుధవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూమన్న యాదవ్, లక్ష్మన్, ఎంఈఓ మైసాజీ, మండల బాధ్యులు రవి జాదవ్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు టక్కరి రమేష్, రాజశేఖర్, గంగాధర్, ప్రదానోపాధ్యాయులు రాజారెడ్డి, నరసింహచారి, ప్రజ్యోత్ కుమార్, రామాగౌడ్, బసవరాజు, భోజబాయి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-తలమడుగు

అంగన్వాడి కేంద్రాలలో నెలకొన్న సమస్యలను, అంగన్వాడీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కిరణ్ డిమాండ్ చేశారు. సమస్యలు తెలుసుకోవడానికి బుధవారం సర్వే చేపట్టారు. మండల కేంద్రంతో పాటు ఝరి అంగన్వాడి కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు సొంత భవనాలు లేవని, చాలీచాలని ఇరుకు కిరాయి గదులు, శిథిలావస్థకు చేరుకున్న వాటిలో కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి అంగన్వాడీలను అనుసంధానం చేస్తూ మూడవ తరగతి వరకు కేంద్రాలలోనే తరగతుల నిర్వహణ చేసేలా ఆలోచనలు చేయడం వాస్తవ పరిస్థితికి పూర్తిగా విభిన్నమని అన్నారు. అంగన్వాడీల వాస్తవ స్థితిగతులపైన దృష్టి సారించి అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.



అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ధోనిపెల్లి వెంకటమ్మ, నాయకులు అనసూయ, రాధ, విజయ, గ్రామపంచాయతీ యూనియన్ సభ్యులు అరుణ్, వెంకటరమణ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
గురువారం | జులై 25, 2024 | www.navatelangana.com

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

నవతెలంగాణ-బజార్హత్నూర్



పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ భీమ్‌రావ్ సూచించారు. బుధవారం మండలంలోని మాడగూడ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ కారణంగా దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబులుతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ఎస్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం మంజుల పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి మొండిచేయి

నవతెలంగాణ-నిర్మల్



కేంద్ర బడ్జెట్లో బీజేపీ ప్రభుత్వం విద్యారంగానికి మొండి చేయి చూపించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల వరకు ఒక్క మాట లేదని, కేంద్ర ప్రభుత్వం విద్య పట్ల ఆసక్తి లేనట్టు కనబడుతుందన్నారు. విద్యారంగానికి కనీస పది శాతం నిధులు కేటాయించాలని, విద్యా కమిషన్‌లు సూచించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు కేంద్ర ప్రభుత్వం 3.06 శాతం నిధులు కేటాయించిందన్నారు. విద్యను ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ చేయడంలో భాగంగా అడుగులు వేయడం సరికాదన్నారు. సమావేశంలో శివచందర్, సాయి, లిఖిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం దిలావార్‌పూర్ మండలం సిర్గాపూర్ గ్రామ శివారులోని 664 సర్వే నెంబర్‌లో నూతనంగా నిర్మించనున్న సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ స్థలాన్ని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన 17 ఎకరాల స్థలానికి ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సర్వే నెంబరును సరిహద్దులను పరిశీలించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్న కళ్యాణి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ ఆర్.సుదర్శన్, తహసీల్దార్ స్వాతి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధి నిర్వహణలో ఉద్యోగులకు బదిలీలు సహజమని టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంద అశోక్, ఎడ్ల నవీన్ కుమార్ అన్నారు. ఇటీవల సాధారణ బదిలీల భాగంగా రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీ అయినా ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓస్ భవన్‌లో బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉద్యోగులను శాలువాతో సత్కరించి వారి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఫణిందర్, సబ్ రిజిస్ట్రార్లు అశోక్, విజయకాంత్, సాయినాథ్, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లంబాడీలకు రాష్ట్ర మంత్రి పదవివ్వాలి



నవతెలంగాణ-ఉట్నూర్

తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల జనాభా కలిగి ఉన్న లంబాడీలకు రాష్ట్ర మంత్రివర్గంలో ఒకరికి కూడా చోటు ఇవ్వకపోవడం సమస్త లంబాడీలను అవమానపరిచినట్టేనని, లంబాడీ జేఏసీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బానోతు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోనీ ఎన్ఆర్ నగర్‌లో సమావేశం నిర్వహించారు. అత్యధిక జనాభా కలిగిన లంబాడీలకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. వెంటనే మంత్రివర్గాన్ని విస్తరించి లంబాడీ ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో తీసుకోవాలన్నారు. జనాభా ప్రాతిపదికన మా వాటా మాకు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లంబాడీల పట్ల వివక్షత చూపొద్దన్నారు. సమావేశంలో లంబాడీ జేఏసీ ఉపాధ్యక్షులు రాథోడ్ శేష రావు, నేతావత్ రాందాస్ నాయక్, రామారావు, ఆడే ఉపేందర్, ప్రేమ్ సింగ్ నాయక్ ఉన్నారు.

వీడని ముసురు..తీరని వెతలు..

- మండలంలో 47.6 మి.మీ వర్షపాతం



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంట పొలాల్లో నీటితో దర్శనమిస్తున్నాయి. మండలంలో 47.6 మీమీ వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురుస్తున్న వర్షం వల్ల ముత్నూర్ చెరువు నిండు కుండలా మారి పరవళ్ళు తొక్కుతుంది. మండలంలో అత్యధికంగా సాగు చేసే పత్తి, సోయా పంటలకు నీళ్ళు నిలువ ఉండటంతో రైతన్న ఆందోళన చెందుతున్నాడు. రాబోవు రెండు రోజుల్లో వర్షం ఇలాగే ఉంటే లోతట్టు ప్రాంత పంటలకు నష్టం వాటిల్లితుందని రైతన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏకధాటి వర్షం వల్ల వాగు పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామాలు జైత్రామ్ తాండా, చిత్తభట్ట, మామిడిగూడ-జీ, బండ పాటగూడ తదితర గ్రామ ప్రజలు అవస్థలు పడ్డారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని రామలింగేశ్వర ఆలయంలో స్టేట్ డెవలప్మెంట్ రూ.ఐదు లక్షల ప్రత్యేక నిధులతో షెడ్డు నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ శ్రేణులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ వన్నెల నరేష్ మాట్లాడుతూ మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ సహకారంతో షెడ్డు నిర్మాణానికి రూ.ఐదు లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గతంలో కూడా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.12 లక్షల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయించిన మంత్రి సీతక్క, ఆడే గజేందర్‌కు గ్రామ పార్టీ, ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామన్న యాదవ్, గంగారెడ్డి, వెంకన్న, అశోక్, ఆశా రెడ్డి, రఘు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- మొక్కలు నాటారు.. రక్త, అన్నదానం
- కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ : మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుగు జోగు రామన్న, పార్టీ నాయకులు

పుట్టినరోజు వేడుకలలో ఆడంబరాలు వద్దు.. పర్యావరణ కార్యక్రమాలే ముద్దు అని కేటీఆర్ ఆలోచన యావత్ సమాజానికే స్ఫూర్తివంతమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అంతకుముందు కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రిమ్స్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ కేటీఆర్ నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కేటీఆర్ పురపాలక, ఐటీ శాఖా మంత్రిగా ఉండి ఆ రంగాల అభ్యున్నతికి విశేష కృషి చేశారన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతం గణనీయ పురోగతి సాధించడమే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రౌత్ మనోహర్, రోకండ్ల రమేష్, అలాల్ అజయ్, సేవ్వ జగదీష్, సాజిదోద్దీన్, విజ్జగిరి నారాయణ, మర్శెట్టి గోవర్ధన్, వేణుగోపాల్ యాదవ్, కస్తాల ప్రేమల, స్వరూప, మమత పాల్గొన్నారు.

రిమ్స్‌లో అన్నదానం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రంగినేనీ మనీషా కేటీఆర్ పిలుపు మేరకు సామాజిక కార్యక్రమంలో భాగంగా రిమ్స్‌లో అన్నదానం చేశారు. ముందుగా సత్యసాయి నిత్యాన్నదాన ట్రస్టులో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజలు చేశారు. అనంతరం కేక్కట్ చేసి తినిపించారు. ఈ సందర్భంగా రోగి సహాయకులకు భోజనం వడ్డించారు. కేటీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసువచ్చి బాదపడుతున్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. బీఆర్ఎస్ పాలనను గుర్తించుకుంటూ కాంగ్రెస్ మోసాలను ఎండగట్టుతున్నారన్నారు.

నార్నూర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకను బుధవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కేక్‌కట్ చేసినంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జఈ చైర్మెన్ అడే సురేష్, తుడందెబ్బ డివిజన్ అధ్యక్షులు కనక ప్రభాకర్, మాజీ సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఉర్వేత రూపదేవ్, నాయకులు సయ్యద్ కాశీం, మాజీ మార్కెట్ వైఎస్ చైర్మెన్ తోడషం నాగోరావ్, మడావి మాన్కు, మాజీ సర్పంచులు రాథోడ్ విష్ణు, రూపదేవ్, మాజీ ఉప సర్పంచులు చౌహాన్ మహేందర్, విష్ణు ఫడ్, నాయకులు ఫేరోజ్ ఖాన్, బాబా ఖాన్, రాథోడ్ శివాజీ, ముంతాజ్, మానిక్ రావ్, అలం ఖాన్, మసూద్ ఉన్నారు.

తాంసి : మాజీ ఐటీ శాఖ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు జన్మదినాన్ని బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ రమణ మండల నాయకులు వినోద్ రెడ్డి, కృష్ణ, రఘు, గోవర్ధన్ రెడ్డి, కాంత్ రెడ్డి, మహేందర్, ఆశన్న ఉత్తం, అశోక్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఉట్నూర్ : బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు బాబా టైగర్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పులిమడుగు ప్రభుత్వ పాఠశాలలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పులిమడుగు పార్టీ నాయకులు ప్రదీప్, బాలాజీ గైక్వాడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

మండలంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ఆధ్వర్యంలో వికాసం పాఠశాల విద్యార్థులతో కలిసి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి తినిపించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాబా శ్యామ్ టైగర్, దుట మహేందర్, గిరి, సాజిద్, సదాని, సురేష్, బాలాజీ, భూమన్న, దినేష్, కేశవ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండ : మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బుధవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు పెంటన్న, చందు, సునీల్, విజయ్ కుమార్, మల్లేష్, రాజు, అక్తర్, నారాయణ, గణేష్, లస్మన్న పాల్గొన్నారు.



తాంసి



ఉట్నూర్



సిరికొండ

సామాన్యులను నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సామాన్య ప్రజలకు నిరాశ కలిగించిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్వదేశీ, విదేశీ సంస్థల కోసం కార్పొరేట్ పన్నులు భారీగా తగ్గించబడ్డాయని, వ్యవసాయ ఉత్పత్తులకు ఎమ్ఎస్పీ చట్టపరమైన హామీ ఇప్పటికీ సుదూర కలగానే మిగిలిందని వాపోయారు. ఈ బడ్జెట్ యువత, విద్యార్థి వ్యతిరేకం, ప్రజావ్యతిరేకమైనది, కార్పొరేట్ మాస్టర్లకు మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రాయిసిడాం గంభీర్, పటేల్ సంజీవ్ ఉన్నారు.

ఉట్నూర్ : కేంద్ర బడ్జెట్‌లో మరోసారి ఉమ్మడి జిల్లాకి తీవ్ర అన్యాయం చేశారని కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రజలు బీజేపీని రెండోసారి ఎంపీగా విజయం సాధించి ఇచ్చిన ఫలితం ఇదే నా అన్ని ప్రశ్నించారు. కేంద్రం బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం చేసిందని, జిల్లా ప్రజలు ఎదురుచూసిన సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ చేయలేదని, విమానాశ్రయం నిర్మాణం, ఆదిలాబాద్ నుండి ఆర్మూర్ వరకు రైల్వే లైన్‌ను మంజూరు వాటికి నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. బడ్జెట్ కేటాయింపులో జిల్లాకు జరిగిన అన్యాయంపై ఎంపీ మాట్లాడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలున్నారు.



ఉట్నూర్ : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నేడు ఎమ్మార్పీఎస్ అత్యవసర సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఏంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశాన్ని ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ మాదిగ తెలిపారు. బుధవారం పట్టణంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్యంగా, సంస్థ గత నిర్మాణం భవిష్యత్ కార్యాచరణకై ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్ గురువారం ఉదయం 11:00 గంటలకు ఈసమావేశం ప్రారంభం అవుతుందని తెలిపారు. దీనికి ఏంఎస్పీ సీనియర్ నాయకులు హాజరు అవుతారని పేర్కొన్నారు. కావున మండల స్థాయి ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు తప్పనిసరిగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి శ్రీను మాదిగ, నరేష్ మాదిగ, వరుణ్ మాదిగ, రాకేష్ మాదిగ పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



నవతెలంగాణ-ముథోల్

భైంసా పట్టణానికి చెందిన ఓ బాలుడు మంగళవారం మండలంలోని చించాల గ్రామానికి రావటంతో స్థానికులు దుడ్డు ప్రసాద్, హౌజేకర్ దత్తు బాలుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భైంసా టౌన్ ఏఎస్ఐ సుదర్శన్‌కు బాలుడు వివరాలు తెలియజేశారు. బాలుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీ నాయకుడు కందుకూరి రమేష్ రోడ్డు ప్రమాదంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పంద్రా జైవంత్ రావు బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట లక్కారం ఉపసర్పంచ్ కోళ్ల సత్తన్న, మాజీ ఎంపీటీసీ నరసయ్య, మాజీ వార్డ్ మెంబర్ కురుస్యంగా భూమన్న, కృష్ణారెడ్డి, ఉట్నూర్ వైట్ యూత్ అధ్యక్షుడు సాజిద్ సిద్ధిఖీ ఉన్నారు.

రిమ్స్ వైద్యుల బదిలీలను నిలిపేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ వైద్యుల బదిలీల ప్రక్రియను నిలిపి వేయాలని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మాల్యాల మనోజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిమ్స్ వైద్య కళాశాలలో ఇప్పటికే సరైన వైద్యులు లేక రిమ్స్‌కు వచ్చే నిరుపేద మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమయంలోనే ఎంతో కొంత వైద్యం అందిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులకు స్థానచలనం కలిగిస్తే ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. కాబట్టి తక్షణమే రిమ్స్ వైద్యుల స్థానచలనం నిలిపి వేసే విధంగా పార్టీలకు అతీతంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి బదిలీలను నిలిపి వేసే విదంగా చూడాలన్నారు.

స్మితా సభర్వాల్‌ను సస్పెండ్ చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజ్యాంగం కల్పించిన హక్కులు దివ్యాంగులకు ఎందుకని వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారిణీ స్మితా సభర్వాల్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయాలని హ్యాండిక్యాప్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఐఏఎస్ అధికారిణీ వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆమె చిత్రపటానికి రక్త(ఎరుపురంగు) అభిషేకం చేసి ఆందోళన చేపట్టారు. వెంటనే స్మిత సబర్వాల్ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హ్యాండిక్యాప్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ దివ్యాంగులకు రిజర్వేషన్‌లు, హక్కులు ఎందుకని వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐఏఎస్ అధికారి అయి కూడా దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే ఆమె క్షమాపణ చెప్పాడంతో ప్రభుత్వం స్మిత సబర్వాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఫైసాల్ అహ్మద్, సయ్యద్ సాజిద్, ముస్తాఫ, ఖలీల్, యూనుస్, ఫెరోజ్ పాల్గొన్నారు.

రైతు బీమా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లోకేశ్వరం

నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు వయస్సు గల రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ ఉమేశ్ తెలిపారు. బుధవారం మండలంలోని రాజురా గ్రామంలో రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5వ తేది లోగా రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్సులు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ జతపరిచి మండల వ్యవసాయాదికార్యాలయంలో ఇవ్వాలని కోరారు.

వేతన జీవులను నిరాశ పరిచిన బడ్జెట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను మరోసారి నిరాశపర్చిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి వి.అశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇన్ కం టాక్స్ స్లాబులను మార్చడంలో వేతన జీవుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు. పాత రిజీమ్ స్లాబుల్లో ఎలాంటి మార్పులు చేయకుండా కొత్త రిజీమ్ ఎంచుకున్న వారికి కేవలం రూ.3లక్షలలోపు మాత్రం పన్ను మినహాయింపులు ఇవ్వడం వల్ల మెజారిటీ ఉద్యోగులను వంచించడం జరిగిందని పేర్కొన్నారు. కార్పోరేట్ వ్యాపారస్తులకు లక్షల కోట్ల రుణాలను రద్దు చేసే ఈ ప్రభుత్వాలు ఉద్యోగులపై మాత్రం పన్నుల భారం మోపడం అహేతుకమని అన్నారు. అలాగే విద్యారంగానికి బడ్జెట్లో నిధులు తగ్గించడం ద్వారా ప్రైవేటీకరణకు దారి తీసే చర్యలు వేగవంతం చేస్తున్నారన్నారని పేర్కొన్నారు. ఈ చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వం వెంటనే విద్యారంగానికి నిధులు పెంచి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలని పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్టీఓకు ఘన సన్మానం

నవతెలంగాణ-ముథోల్

బదిలిపై వెళ్తున్న ఎస్టీఓ సత్యనారాయణను బుధవారం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సుమారు 12 సంవత్సరాలు ముథోల్‌లో విధులు నిర్వహించి జగిత్యాల డీటీఓ కార్యాలయానికి బదిలిపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు రవిజాదవ్, నన్నం రాజేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టక్కరి రమేష్, బి.గంగరావ్, జిల్లా బాధ్యులు రాజశేఖర చారి, రామాగౌడ్, రాజు, నారాయణ, భూమన్న పాల్గొన్నారు.

బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికీ చెప్పొద్దు

- ఎస్ఐ సక్రియా నాయక్

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని రైతులు వారి బ్యాంక్ ఖాతా వివరాలను ఎవరికి చెప్పవద్దని ఎస్సై సక్రియా నాయక్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు బ్యాంక్ ఖాతాల్లో రైతు రుణమాఫీ డబ్బులు పడుతున్నాయని తెలిపారు. దీన్ని ఆసరా చేసుకుని సైబర్ మోసగాళ్లు ఫోన్ చేసి వారి బ్యాంక్ ఖాతా వివరాలను అడిగే అవకాశం ఉంటుందన్నారు. దీనివల్ల బ్యాంక్ అకౌంట్‌ను హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

28న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఆదివాసీ సేన ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షులు సేడ్మకి భీంరావ్ కోరారు. బుధవారం మండలంలోని మల్కపూర్, చిన్న మల్కపూర్, గర్కంపేట్, సోమార్‌పేట్, సీతాగోంది, మాన్కుగూడ, మచ్చపూర్, కోలంగూడ తదితర గ్రామాల్లో పర్యటిస్తూ రక్తదాన శిబిరం గురించి వివరించి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడాం జంగు పటేల్, ఆదివాసీ విద్యార్థి సేన జిల్లా కన్వీనర్ కుమురం చత్రుఘన్, ఆదివాసీ సేన మండల ప్రధాన కార్యదర్శి ఉయిక శ్యాంరావు, రైతు సేన మండల ప్రచార కార్యదర్శి పేందూర్ రాందాస్, మడావి రాము పాల్గొన్నారు.



3

నవతెలంగాణ
నమ్మదగిన తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

గురువారం | జులై 25, 2024 | www.navatelangana.com

గంజాయి స్వాధీనం..ఒకరిపై కేసు నమోదు

నవ తెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం బెంగాలీ క్యాంప్ నెం.8లో టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా గంజాయి స్వాధీనమైంది. టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం ఈస్గాంలో గంజాయిని విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు బుధవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈస్గాంలోని విలేజ్ నెంబర్ 8 లో దాడులు నిర్వహించారు. దిలీప్ కుమార్ మండల్ ఇంట్లో తనిఖీ చేపట్టగా అతని ఇంట్లో ప్రభుత్వ నిషేధిత గంజాయి 200 గ్రాములు లభ్యమైంది. సదరు నిందితుడు మహారాష్ట్ర నుండి గంజాయిని తెచ్చి ఈజ్‌గాం పరిసర గ్రామాల ప్రజలకు విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. విలువ రూ. 6000 ఉంటుందని, గంజాయి, నిందితున్ని ఈజ్‌గాం పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ వెంకటేష్, పీసీలు మధు, రమేష్ పాల్గొన్నారు.

నాలుగు వరుసల రహదారిగా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని శ్రీశక్తి ఎన్‌హెచ్ 363 నాల్గవ రహదారిలో ఎక్కడ కూడా బస్‌షెల్టర్‌లు లేవని వాటిని ఏర్పాటుచేయాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారని విద్యార్థులు, ప్రజలకు ఇబ్బందికరంగా ఉందన్నారు. డీబీఎల్ కంపెనీ ఎక్కడ కూడా బస్‌షెల్టర్ ఏర్పాటులేదని, వర్షాకాలంలో విద్యార్థులు, ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఆసిఫాబాద్ మోడల్‌స్కూల్, మండలంలోని మోడల్ డిగ్రీ కళాశాల వద్ద బస్‌షెల్టర్ లేక వర్షానికి తడుస్తూ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. నాలుగు వరుసల రహదారి ప్రక్కనే కళాశాల వరకు వెళ్లాలంటే సగం కిలోమీటర్ రోడ్డు ఉంది. కానీ దానికి డీబీఎల్ కంపెనీ కనీసం రోడ్డు సౌకర్యం కూడా కల్పించలేదని పేర్కొన్నారు. మొత్తం బురదతో కళాశాల విద్యార్థులు వెళ్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే డీబీఎల్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ డిమాండ్ చేస్తున్నాం. లేనిపక్షంలో మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులను కలుపుకొని జాతీయ రహదారిపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పీకలగుండ గ్రామానికి మంచినీటి సరఫరా

- నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు
- మిషన్ భగీరథ పైప్‌లైన్ పునరుద్ధరణ



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని పీకలగుండ గ్రామంలో ఏర్పడ్డ తాగునీటి సమస్యపై మంగళవారం 'గొంతుతడవాలంటే.. నీటిలో మునగాల్సిందే' అనే శీర్షికన తాగు నీటి సమస్యలపై నవతెలంగాణ దినపత్రిలో కథనంపై ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు మిషన్‌భగీరథ పైప్‌లైన్‌లను పునరుద్ధరించి తాగు నీరు సరఫరా చేశారు. నూతన మోటర్‌ను బిగనున్నట్టు అధికారులు తెలిపారు.

సీసీ కెమెరాలను అమర్చుకోవాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యంలో బుధవారం వ్యాపార దుకాణ యాజమానులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌటాల సీఐ సాధిక్ పాషా మాట్లాడుతూ నేరాలు నియంత్రణ, స్వీయ భద్రతకు సీసీ కెమెరాలు బాగా తోడ్పాటునిస్తాయని, నేరం చేయడానికి నేరస్తులు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారని తెలిపారు. ఎక్కడ నేరం చేసిన కెమెరాల ద్వారా నేరస్తులను గుర్తుపట్టవచ్చని సూచించారు. ప్రజలు వ్యాపారస్తులు, సహాయ సహకారాలతో నేను సైతం, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలు దాతల సాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో నిఘా కోసం సీసీ కెమెరాలు ఎంతో కీలక ప్రాత వహిస్తాయన్నారు. ప్రజలు, పోలీసుల సమన్వయంతోనే నేరాలు నియంత్రణకు సాధ్యమవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేష్, పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ అనేక అవకతవకలకు పాల్పడుతున్న జిల్లా బీసీ సంక్షేమ అధికారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బీసీ సంక్షేమ అధికారి గత 3, 4 సంవత్సరాలుగా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం అందరికి తెలిసినదేనని వివరించారు. బీసీ బంధు పథకంలో అవకతవకలు జరిగినప్పటికీ సరైన విచారణ జరగలేదని అన్నారు. హాస్టల్లో సిబ్బందిని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా నోటి మాట ద్వారా ఇతర ప్రాంతాలకు పంపుతున్నారని ఇలా చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో పని చేస్తున్న సిబ్బంది రాకపోతే ఆయా హాస్టల్ వార్డెన్లు సిబ్బంది గైర్హాజర్ పై రిపోర్టు ఇచ్చిన కూడా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్‌లతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్ ను కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు బొట్టుపల్లి సాయికృష్ణ, సామజిక కార్యకర్త కల్లూరి ప్రశాంత్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఆర్ఐకి వీడ్కోలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సిర్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్(ఆర్ఐ)గా విధులు నిర్వహిస్తున్న ముబీన్ ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ కావడంతో తహసీల్దార్ శ్రీనివాస్, కౌటాల సీఐ సాదిక్ పాషా, కార్యాలయ సిబ్బంది శాలువాతో సత్కరించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని, నీతి, నిజాయితీతో పారదర్శకతతో జవాబు దారీతనంతో బాధ్యతగా విధులు నిర్వహించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. అప్పుడే ప్రజల ఆదరణ, మన్ననాలు పొందుతామని తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతగా జవాబుదారి తనంతో విధులు నిర్వహించి ప్రజల ఆదరణ పొందిన, చేసిన సేవలను కొనియాడుతూ ఉద్యోగ విరమణ అయ్యేవరకు ఇదే విధంగా ప్రజలకు సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ బక్కయ్య, ఆర్ఐ జుగాడి రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌కు కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల విధుల్లో ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, ఆర్ఐలు సాయి, రహమాత్, కార్యాలయ సిబ్బంది చిన్ను, సాయి తేజ, యాసిన్, మనోహర్, లక్ష్మి పాల్గొన్నారు. అదే విధంగా ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఏఓగా విధులు నిర్వహిస్తున్న రఫత్ హుస్సేన్ మంచిర్యాల జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆయనకు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ ఎండీ అహ్మద్, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ రియాజ్ అలీ, సీనియర్ జర్నలిస్టు హరికృష్ణ, టీయూడబ్ల్యూజే జాయింట్ సెక్రెటరీ అబ్దుల్ హన్నాన్, నాయకులు తారు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అహ్మద్ బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్ నిసార్, జాకీర్ రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నూతనంగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి యువరాణి సూచించారు. బుధవారం కాగజ్ నగర్ మండలం బోడపల్లి గ్రామంలో రైతుల దరఖాస్తులు స్వీకరించారు. వచ్చే నెల 14నుంచి ప్రారంభమవుతున్న రైతుబీమాకు సంబంధించి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంతకు ముందు సంవత్సరంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకోనివారు, 28 జూన్ 2024 వరకు డిజిటల్ సంతకంతో కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు ఈ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 నుంచి 59 ఏండ్ల వయసు గల రైతులు ఏఈఓకు రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు రైతు పట్టాదారు పాసు పుస్తకం జీరాక్స్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జీరాక్స్ జతపరిచి ఇవ్వాలన్నారు.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



కాగజ్‌నగర్ : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవ తెలంగాణ-కాగజ్‌నగర్

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చెయ్యి చూపడాన్ని నిరసిస్తూ బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలే సాయి కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగానికి మొండి చెయ్యి చూపించిందని, దేశంలో విద్యాభివృద్ధి కోసం కనీసం కేటాయించాల్సిన నిధులను కూడా కేటాయించలేదన్నారు. గతేడాదికి, ఈ ఏడాదికి బడ్జెట్ మొత్తం 7 శాతం పెరిగినా విద్యారంగానికి మాత్రం కేటాయింపులు తగ్గించారన్నారు. గత మొత్తం బడ్జెట్ రూ.45,03,638 కోట్ల నుండి రూ.48,21,000 కోట్లకు పెరిగిందని అంటే 7 శాతం బడ్జెట్ పెరిగింది కానీ విద్యారంగానికి తీవ్రంగా నిధులను తగ్గింపు చేశారన్నారు. బడ్జెట్‌ను సవరించి, ప్రభుత్వ రంగంలో ఉన్నత విద్యాభివృద్ధి కోసం చర్యలు తీసుకొని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిరికొండ నితీష్, నాయకులు రాజ్ మండల్, నాందేవ్, సాయి చరణ్, జ్ఞానేశ్వర్, కార్తీక్, చిత్తరంజన్ మండల్, ప్రదీప్ మండల్ పాల్గొన్నారు.

కెరమెరి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు.నైపుణ్యానికి పెద్దపీట పేరుతో కార్పొరేట్ల అవసరాలను తీర్చే కుట్ర జరుగుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి 3.06 శాతం నిధులు ఏ మాత్రం సరిపోవన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు విద్యార్థి లోకానికి తీవ్ర నిరాశ పర్చాయని, యువతకు ఉపాధి పేరుతో ప్రైవేటు కంపెనీలకు లాభం చేకూర్చే చర్యలకు పూనుకుందని ఆరోపించారు. 3 శాతం వడ్డీతో ఉన్నత విద్యను అభ్యసించే వారికి రూ.10 లక్షలు, లక్ష మంది విద్యార్థులకు ఇ-వోచర్లు అందించనున్నట్లు చెబుతున్న ప్రభుత్వం రుణాలకు అర్హత సాధించేందుకు నిర్దిష్టమైన ప్రమాణాలేంటో తెలిపాలన్నారు.ఉన్నత విద్యను అభ్యసించే వారికి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగాలే ఆర్థికాభివృద్ధికి పునాది అంటూనే ప్రభుత్వరంగలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా ప్రైవేటును ప్రోత్సహించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, జిల్లా కమిటీ నాయకులు భీంరావ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన బాలికలు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన బాలికలు క్రీడారంగంలో అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా సిద్ధం కావాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రీడా పాఠశాలలు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆర్. రమాదేవి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌లతో కలిపి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. గిరిజన బాలికల పాఠశాల నుంచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో శ్రమించి మరింత తర్ఫీదు ఇచ్చి అంతర్జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలన్నారు. క్రీడా పాఠశాలలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పాఠశాలలో నాటిన మొక్కలను విద్యార్థులు ఒక్కొక్క దానిని దత్తత తీసుకొని వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఏసీఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓ క్షేత్రయ్య, గిరిజన క్రీడ అధికారి బండ మీనారెడ్డి, క్రీడా పాఠశాల హెచ్ఎం కృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు వేగంగా పరిశీలించాలి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన సేవా కేంద్రాన్ని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్‌లతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు పథకం ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ప్రక్రియ నిర్వహణలో తలెత్తే సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పరిశీలన ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ జాతుల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దాం

జిల్లాలోని ఆదివాసీ జాతుల అభివృద్ధికి, ప్రతి గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమం పథకాల ఫలాలు అందించేందుకు సమిష్టిగా కృషి చేద్దామని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో గిరిజన అభివృద్ధి, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసుల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని, విద్య, వైద్యం అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కనీస మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులపై పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదివాసీ గ్రామాలకు, మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. మారుమూల గ్రామాలను జిల్లా కేంద్రానికి అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిపేందుకు ఆదివాసీ నాయకులు, కుల పెద్దల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారాం బట్, డీటీడీఓ రమాదేవి, ఆదివాసీ నాయకులు సిడాం అర్జు, కుర్సింగ మోతిరామ్, మడావి గుణవంతరావు, ఆత్రం భీమ్‌రావు, పెందూరు సుధాకర్, పోచయ్య, కుల సంఘాల నాయకులు, సర్ మెడీలు పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

- కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



ఆసిఫాబాద్ : కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకున్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. గొప్ప విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్ అని అదే విధంగా హైదరాబాద్ ఐటీ రంగంలో అనేక దేశ విదేశాల నుంచి వివిధ కంపెనీలను తీసుకువచ్చి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన వారన్నారు. ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళ నాయకుల మర్సుకోల సరస్వతి, మాజీ జడ్పీటీసీ కోవ అరుణ, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ హైమద్, మండల అధ్యక్షుడు జాబురే రవీందర్, టౌన్ ప్రెసిడెంట్ అహ్మద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కెరమెరి : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ 47వ పుట్టినరోజు వేడుకలను బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, మోతీరాం, జడ్పీటీసీ ద్రుపతబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం మాట్లాడారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. అనంతరం కేక్ కోసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ఇఫ్తేకార్ అహ్మద్, గోగర్ల రాజయ్య మాజీ సర్పంచులు తొడసం జగన్నాథ్‌రావు, నాయకులు ఇనూస్, భీంరావు,మున్ను,సెండే నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అజయ్‌కుమార్ కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ పెంటు, మాజీ సర్పంచ్ తుకారాం, బంబారా మాజీ ఎంపీటీసీ వినోద్, అశోక్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కెరమెరి : కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జూర్‌లో పొంగిపొర్లుతున్న వాగులు

నవతెలంగాణ-బెజ్జూర్



బెజ్జూర్ మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బెజ్జూరు మండలంలో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. బెజ్జూర్ మండలంలోని కృష్ణ పల్లి, శీష్మర్ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ ప్రాంతానికి వెళ్లలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బెజ్జూర్ మండలంలోని తలాయి, తిక్కపల్లి ,భీమారం గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. మండలంలోని ముగవెల్లి, సోమేని, తల్లై,తిక్కపల్లి, పాత సోమేని, గొర్రెగూడెం, పాపన్నపేట, కోయపల్లి, చింతలపల్లి, నాగపల్లి, తదితర గ్రామాల చుట్టూ ప్రాణహిత నది వరద రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రాణహిత నది ఒకవైపు రైతులను ఇబ్బందులకు గురి చేస్తుండగా మరోవైపు వాగులు, వంకలు ఉప్పొంగి రవాణా వ్యవస్థ స్తంభించిపోతుంది. ప్రాణహిత బ్యాక్ వాటర్ తో పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతుంది. వేసిన పత్తి, సోయాబీన్ పంటలు నీటి మునగడంతో రైతుల పెట్టుబడి నీటిలో కలిసిపోతుందని మండల రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రతినిధులు స్పందించి బెజ్జూర్ మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్ వల్ల నీట మునిగిన పంటలను నష్టపరిహారం చెల్లించాలని, వాగులు పై వంతెనలు నిర్మించాలని మండల వాసులు కోరుతున్నారు.

ఘాట్ రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

- గంటపాటు నిలిచిన రాకపోకలు
- ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు




నవతెలంగాణ- కెరమెరి

జిల్లాలో గత వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి.బుధవారం వర్షాల కారణంగా కెరమెరి ఘాట్ రోడ్డు లో బూసిమెట్ట గ్రామానికి సమీపంలో చెట్టు విరిగి ప్రధాన రహదారిపై పడి పోయింది. జన సంచారం లేని ప్రాంతం కావడంతో పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు పడి పోవడంతో ఉదయం గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది.ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఉట్నూర్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి రాకపోకలు కొనసాగించే,ఉద్యోగులు సిబ్బంది సమయానికి చేరుకోవాల్సి ఉండగా ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బందులు ఎదుర్కోన్నారు.ఆర్టీసీ బస్సు డ్రైవర్లే గంట పాటు శ్రమించి చెట్టును తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది.తరుచుగా ఘాట్ రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడతుండడంతో అధికారులు స్పందించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సౌకర్యాలతో నాణ్యమైన విద్యను అందించాలి

- ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా



నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వ పాఠశాలలలో అన్ని సౌకర్యాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా అన్నారు. బుధవారం మండలంలోని గోలేటి ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలను సందర్శించి పాఠశాల ఆవరణ, రిజిష్టర్లు, తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, విద్యుత్, మూత్రశాలలతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులకు సకాలంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, వర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, బ్లాక్ బోర్డ్ ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాల భవనానికి అవసరమైన మరమ్మత్తులు చేయాలని కాగజ్‌నగర్ ఏఈను ఆదేశించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హాజరు, ఇతరత్రా అంశాలపై హెచ్ఎం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

అడ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏడతెరపిలేని వర్షంతో ఆసిఫాబాద్ జిల్లాలోని కుమురం భీం అడ ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదులుతున్నారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు వీటిలో 4, 5, 6 గేట్లు 0.50 మీటర్ మేర ఎత్తి 3230 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా బుధవారం ఉదయం నాటికి 237.800 మీటర్లకు చేరుకొంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.872 టీఎంసీలకు చేరుకుంది. ఇన్ ఫ్లో 3180 క్యూసెక్కులు గా ఉంది. దీంతో 3 గేట్లు ఎత్తి 3230 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు కింద ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఆగస్టు 9న వర్గీకరణకు జంతర్ మంతర్ దీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీల వర్గీకరణ కోసం టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే దీక్ష విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జిల్లా అధ్యక్షుడు మల్లేష్ తో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ 2014లో ఇచ్చిన హామీ మేరకు వందరోజుల్లో వర్గీకరణ చేస్తానని మోసం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే ఉద్దేశంతో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆత్మకూరి మల్లేష్, వెంకటేష్, సురేష్, చిల్లారి పెందు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బడ్జెట్

నవతెలంగాణ-రెబ్బెన

పేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి, వికసిత భారత్ లక్ష్యాలుగా భారత ప్రధాని మంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ.48.20 లక్షల కోట్ల బడ్జెట్‌ను బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయులు గౌడ్ అన్నారు. బుధవారం ఆయన గోలేటిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్త ఆదాయపు పన్ను విధానాలు ఉద్యోగులు, వ్యాపారులందరికీ మేలు జరిగేలా స్లాబు విధానాన్ని రూపొందించడం హర్షనీయమన్నారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో రూ.36వేల కోట్లు కేటాయించారని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణకు ఏమి ఇవ్వలేదని ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. అసత్య అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చి సీఎం హామీలను అమలు చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి జగన్నాథ ఓదెలు పాల్గొన్నారు.

4
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | జులై 25, 2024 | www.navatelangana.com

విధుల్లో చేరిన కొత్త సిబ్బంది



నవతెలంగాణ-హాజీపూర్

మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల ఉద్యోగుల బదిలీల్లో భాగంగా నూతన అధికారులు బదిలీపై రాగా బుధవారం అందరూ భాధ్యతలు తీసుకుని విధుల్లో చేరారు. సూపరింటెండెంట్‌గా బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, టైపిస్ట్ రాజశ్రీ, కార్యాలయ సబ్ ఆర్డినేట్ సుమిత్‌లు బదిలీపై వచ్చారు. జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్ల బదిలీలు జరిగినప్పటికీ వారికి పూర్తి స్థాయి భాధ్యతలు అప్పగించలేదు. వీరిని డెప్యూటేషన్లపై ఖాళీలు ఉన్న చోటకు బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఆర్‌డీఓ మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. బుధవారం మండలంలోని జన్నారం గ్రామపంచాయతీలో ఉన్న నర్సరీ, ప్లాంటేషన్ను పరిశీలించారు. ప్లాంటేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీలో జరుగుతున్న శానిటేషన్ పనులు పరిశీలించారు. ప్రతి గ్రామపంచాయతీలో పరిశుభ్రత పాటించాలని బ్లీచింగ్ పౌడర్ అవసరమైన చోట చల్లాలని డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయించి కార్యదర్శులకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా కచ్చితంగా పాటించాలన్నారు. ఈ వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బందితో కోఆర్డినేషన్ చేసుకొని పనిచేయాలన్నారు. వీరితోపాటు ఎంపీడీఓ శశికళ ఏపీఓ రవీందర్ ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్మా జిల్లా కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం(ట్రస్మా) జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పాత కమిటీ సమయం అయిపోవడంతో అప్పటి కమిటీనీ రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికలు జరిపే సమయంలో పోటీకి ఎవరు లేక పోవడంతో సభ్యుల అనుమతితో ఎన్నికలు ఏకగ్రీవం చేసినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా దామెర్ల సిద్ధయ్య లిటిల్ ఫ్లవర్ స్కూల్ మందమర్రి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి స్లేట్ హై స్కూల్ జన్నారం, జిల్లా కోశాధికారిగా డా. ఉదారి చంద్రమోహన్ గౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికైన సభ్యులకు జిల్లాలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు శుభాకాంక్షలు తెలిపాయి. మాజీ జిల్లా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ గత ఐదు సంవత్సరాలు సహకరించిన ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలకు, విద్యాశాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం జులై 31న ఉండనట్లు పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో గత వారం రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగ చెన్నూరు నియోజకవర్గంలో కాళేశ్వరం బ్యాక్ వాటర్ కింద పంట నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, సభ్యుడు గుమాస అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం బెల్లంపల్లిలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు గుమస అశోక్‌లు మాట్లాడుతూ వందల ఎకరాల పంట నష్టం జరిగిందని, పంటలు నీట మునిగిపోయి రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. జిల్లాలో పలు గ్రామాలు వార్డులు నీటిలో మునిగిన పరిస్థితి కూడా ఉందన్నారు. వరదకు చాలా వరకు రోడ్లు దెబ్బ తిన్నాయని కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ,కాంగ్రెస్ పార్టీల నాయకులు పర్యటనలకే పరిమితం కాకుండ వారి ప్రభుత్వాల ద్వారా తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా కృషి చెయ్యలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి నష్టపోయిన రైతులకు ప్రజలకు నష్టపరిహారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు నాగరాజు, గోపాల్, దూలం శ్రీనివాస్, అబ్బోజు రమణ, చల్లూరి దేవదాస్, అరిగెల మహేష్, డోర్కె మోహన్ పాల్గొన్నారు.



జల్సాల కోసం దొంగతనం



నవతెలంగాణ-మంచిర్యాల

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు మైనర్‌లను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల సీఐ బన్సిలాల్ తెలిపిన వివరాల ప్రకారం. పట్టణ హైటెక్ సిటీలో నివాసం ఉండే రాముల ప్రతాప్‌రెడ్డి తాను నిర్మించే నూతన ఇంటి ఆవరణలో ఉన్న రూ.30 వేల విలువ గల ఇనుప కిటికీ ఫ్రేమ్ లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసే క్రమంలో మంచిర్యాల పట్టణంలో ఎస్ఐ సురేష్‌తో కలిసి వాహనాల తనిఖీలు చేస్తుండగా, ఆటోలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని, జల్సాలకు డబ్బులు సరి పోక పోవడంతో దొంగతనలు చేయాలని నిర్ణయించుకొని దొంగతనం చేసిన కిటికీలను స్క్రాప్ దుకాణంలో అమ్మినామని, మిగిలిన కొన్నిటిని ఇతర దుకాణంలో అమ్ముకోడానికి వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుండి ఆటో 21 ఇనుప కిటికీ ఫ్రేమ్స్‌ను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.

కూలిన కల్వర్టును వెంటనే బాగు చేయండి



నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని టీ టైమ్ పక్క నుండి వెళ్లే దారిలోని డ్రైనేజీపై నిర్మించిన కల్వర్టును వెంటనే బాగు చేయాలని యూత్ అధ్యక్షుడు దర్శనాల నవీన్ కోరారు. బుధవారం అయన కూలిపోయిన కల్వర్టును పరిశీలించి ప్రమాదాలు జర్గకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వెంటనే మరమ్మత్తులు చేసి శాశ్వత పరిష్కారం చేయాలని అయన మున్సిపల్ అధికారులను కోరారు.

ఆశా కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త తీగల శ్యామల గత 19 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే అనారోగ్యంతో మరణించిందని ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె కుటుంబాన్ని ఆశా కార్యకర్తలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామల అనారోగ్యం పాడిన పడిన ఆమె కూతురుతో పనులు చేయించుకున్నారని ఆశా కార్యకర్తలతో వెట్టి చాకిరి చేయించుకున్న ప్రభుత్వం వారి కుటుంబాలను ఆదుకోవడం మర్చిపోయిందని విమర్శించారు. శ్యామల కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని అన్నారు. కలెక్టర్ స్పందించి ఎన్ని రోజులు ఆశా కార్యకర్తగా పనిచేసిన శ్యామల కూతురు సుస్మితకు ఆశా కార్యకర్తగా నియామక పత్రం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి శ్యామల కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ, జిల్లా కమిటీ సభ్యురాలు పద్మ, నాయకులు గంగ, శారద, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

లారీలు ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి



నవతెలంగాణ-తాండూర్

తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాండూర్ ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్వర్(35) అక్కడికక్కడే మృతి చెందాడు. నాగపూర్ నుండి హైదరాబాద్ వెళ్తున్న లారీ నెంబర్ ఎంహెచ్ 40 ఏకే 2044 నెంబర్ లారీని మరో లారీ 01 యూటీ 3948 వేగంగా వెనకనుంచి ఢీకొట్టగ డ్రైవర్ అన్వర్‌కు తీవ్ర రక్త శ్రవంమై అక్కడే చనిపోయినాడు. అన్వర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆగస్టు 5 లోపు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

ఆగస్టు 5 లోపు కొత్త రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని జన్నారం క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పోన్కల్ రైతు వేదికలో పలు గ్రామాల నుంచి వచ్చిన రైతుల నుండి రైతు బీమా రెన్యువల్, నూతన దరఖాస్తులను స్వీకరించారు. రైతు బీమాలో నామిని, తప్పుల సవరణకు జూలై 30, రైతు బీమాకు నూతన దరఖాస్తు సమర్పించేందుకు ఆగస్టు 5 తుది గడువని, ఈ విషయాన్ని రైతులు గమనించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధరణి సహాయ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-హాజీపూర్

మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం ధరణి సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ ధరణీ సహాయ కేంద్రాన్ని తహసీల్దార్ సతీష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించగా ప్రత్యేక అధికారిగా నియామకమైన జూనియర్ అసిస్టెంట్ ఖుర్షీద్ ధరణీ భాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మ్యూటేషన్ కోసం, ధరణీలో నమోదు చేసిన డిజిటల్ సంతకం కానివారు, పేరు మార్పు, కోర్టు, ప్రభుత్వ భూములుగా కాని నమోదు జరిగిన సర్వే నంబర్ల నిషేధిత జాబితా నుంచి తొలగించుట కోసం, సర్వే నంబర్‌లో ఎలాంటి బదలాయింపు జరగకుండా నిలుపుదల కోసం, ధరణీలో పట్టాదారు పేరు మార్పు కోసం, సంస్థ, కంపనీల పేరు మీద కొనుగోలు చేసిన భూములకు పట్టా పాస్‌పుస్తకాల కోసం, సవరణల కోసం, భూమి మార్పు, విస్తీర్ణం సవరణ, నాలా భూములు తిరిగి వ్యవసాయ భూములుగా మార్పు కోసం ఇలా ప్రతీ సమస్యతో పాటు దరణి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న పలు దరఖాస్తులతో పాటు వచ్చిన ఫిర్యాదులను సహాయ కేంద్రం ద్వారా పరిష్కారం అయ్యేవిధంగా చూస్తామని తెలిపారు.



హాజీపూర్‌లో..

కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ హరిత, ఆర్ఐ మంగ, ప్రభు, ధరణీ ఆపరేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.


తాండూర్‌లో..

తాండూర్ : మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ మండల వ్యవసాయ అధికారి కిరణ్మయితో కలిసి ధరణి సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటినుండి ధరణికి సంబంధించి ధరణి మాడ్యూల్ టీఎం 33లోని మిస్సింగ్ సర్వే నంబర్ విస్తీర్ణం భూమి తరగతులు నిషేధిత భూములు వారసత్వ భాగస్వామ్యం పంపకం వంటి వివరాలను ధరణి సహాయ కేంద్రం ద్వారా సలహాలు సూచనలు పొందవచ్చునని తెలిపారు. ఇంతకుముందు రైతులు మీసేవ కేంద్రాల్లో అవగాహన లేమితో తప్పుగా నమోదు చేసుకొని ఇబ్బందులు పడ్డారని తెలిపారు. రైతుల ఇబ్బందులను గ్రహించిన ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయంలో ధరణి సేవలను అందించే విధంగా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ ఆంజనేయులు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కి బానిస కావద్దు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

గంజాయి, డ్రగ్స్ లాంటి వాటికి యువత అలవాటుపడి జీవితాన్ని నాశనం చేసుకోకూడదని లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్ అన్నారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో గంజాయి, డ్రగ్స్‌కి అలవాటు పడిన పలువురు యువకులను, వాళ్ళ తల్లితండ్రులను స్టేషన్‌కి పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వాడిన వాటిని సరఫరా చేసి చాలా పెద్ద నేరం అన్నారు. గంజాయిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని ప్రత్యేక పోలీసుల ప్రర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఒకసారి గంజాయి లాంటి వాటి కేసుల్లో ఇరుకుటే ఎవరు రక్షించలేరని పిల్లల్ని అనుక్షణం పర్యవేక్షించాల్సిన బాధ్యత తల్లితండ్రులదేనని అవగాహన కల్పించారు. పట్టణంతో పాటు మండలంలో ఎవరైనా గంజాయి డ్రగ్స్ వాడిన వాటిని విక్రయించినట్లు తెలిసిన లక్సెట్టిపేట ఎస్ఐ 87126 56545 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని చెప్పిన వాళ్ళ పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట ఎస్ఐ సతీష్‌తో పాటు యువకులు, వాళ్ళ తల్లితండ్రులు ఉన్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కొయ్యడ జనార్దన్ అనే రైతు ఇల్లు బుధవారం ఉదయం కురుస్తున్న వర్షానికి పెంకుటిల్లు పైకప్పు కూలి కింద పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదని ఇంటి యజమాని కొయ్యడ జనార్దన్ తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి వెంటనే తనకు సాయం చేయాలని బాధితుడు కోరారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ-నస్పూర్

కారుణ్య నియామకాలలో భాగంగా శ్రీరాంపూర్ ఏరియాలో నియామకమైన 7 మంది యువతీ-యువకులకు జీఎం బి సంజీవరెడ్డి నియామక పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందని, దక్షిణ భారతదేశంలోనే సింగరేణి సంస్థ దేశానికే తలమానికంగా ఉందని అన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నం చేయకుండా, గైర్హాజరు కాకుండా ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (ప) పి అరవింద రావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ పీఓ కాంతారావు, పిట్ కార్యదర్శి రామ్ చందర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

వతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర మాజీ ఐటీ శాక మంత్రి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్లో మండలంలోని తపాలపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కమ్మల విజయ ధర్మ రక్తదానం చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం, యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. రానున్న రోజుల్లో మళ్ళీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

నస్పూర్ : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని మంచిర్యాల మాజీ శాసనసభ్యులు నడిపల్లి దివాకర్ రావు ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించి, రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ నాయకులు శిబిరంలో పాల్గొని రక్త దానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా రక్త దానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పట్టణ అధ్యక్షులు అక్కూరి సుబ్బయ్య, పార్టీ కార్యదర్శి మెరుగు పవన్ కుమార్, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి,డాక్టర్ రాజా రమేష్ పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు పాల్గొన్నారు. అదేవిదంగా దేవాపూర్‌లో మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దండవేణి చంద, కైలాస్ పాల్గొన్నారు. కొండాపూర్ యాపలో మండలంలోని తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు.



స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలి



నవతెలంగాణ-మందమర్రి

వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ అనంతరం స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలని జీఎం మనోహర్ సూచించారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు బుధవారం సీఈఆర్ క్లబ్‌లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కంప్యూటర్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లీష్‌లకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 246 మంది మహిళలు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏరియా జీఎం మనోహర్, ఏరియా సేవా సమితి ప్రెసిడెంట్ సవిత మనోహర్ కోర్సులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ శిక్షణ తర్వాత స్వయం ఉపాధి మార్గాలను అన్వేషించాలని సూచించారు. అనంతరం వృత్తి శిక్షణ కోర్సులలో ఉత్తీర్ణులైన 187 మందికి సర్టిఫికెట్లను, అవసరమైన సామాగ్రిని అందజేశారు. సింగరేణి యాజమాన్యం సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటుందని అనేక కార్యక్రమాలను కూడా నూతనంగా చేపడుతుందని అన్నారు. మహిళలు, యువతులు, యువకులు ఇట్టి అవకాశాలను వినియోగించుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, డివైపిఎం ఆసిఫ్, జె అనసూయ రీజినల్ ఆఫీసర్ ఖాది పాల్గొన్నారు.

కోరిక తీర్చలేదని మహిళ గొంతు పిసికి హత్య

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని లంబాడితండాలో తన కోరిక తీర్చమంటే ప్రతిఘటించిన మహిళను అంబారావు అనే వ్యక్తి గొంతు పిసికి హత్య చేసినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మీర నీల(44) అనే మహిళ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తన మొదటి భర్త పెళ్లైన ఒక సంవత్సరానికే చనిపోయాడు. రెండో భర్త 15 సంవత్సరాల క్రితం చనిపోగా పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తూ ఇద్దరు లంబాడితండాలో ఉంటున్నారు. గాండ్ల రవి స్నేహితుడు కుడిమెత అంబారావు అప్పుడప్పుడు రవి లేని సమయంలో ఇంటికి వెళ్లి మృతురాల్ని తనతో సహజీవనం చేయాలని బెదిరించేవాడు. బుధవారం మధ్యాహ్నం వల్లంగూడకు చెందిన అంబారావు మృతురాలు నీలా దగ్గరికి వెళ్లి తన కోరిక తీర్చమంటే ప్రతిఘటించడంతో గొంతు పిసికి హత్య చేశాడు. ఈ మేరకు మృతిరాలి అన్న అజ్మీర దేవి సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటన స్థలాన్ని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు.



పంట నష్ట పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ- కెరమెరి



పంట నష్టపరిహారం చెల్లించాలని ఆదివాసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయని తెలిపారు. ప్రభుత్వం పంట నష్టం పై ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే సర్వే చేపట్టి, పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో రైతులు పూసం సంభాజీ, తిరుపతి,దేవుశావ్ , గుల్వంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు దింద, బాబా సాగర్ - నాయకప్పు గూడ, గూడెం - కోయపల్లి, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు లేక బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల నుండి ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చడంతో వివిధ గ్రామాలు ఇబ్బందులు పడుతున్నాయి. బుధవారం మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య వాగు వద్ద పరిశీలించి, ఆ గ్రామస్తులతో చరవాణి ద్వారా మాట్లాడి వారు బాగోగులు తెలుసుకుంటూ, నిత్యావసర సరుకులు లేక ఇబ్బందులతో గురి అవుతున్నామని, పంట పొలాలలో వరద నీరు ప్రవహించి పంట నష్టం జరిగినట్లు తెలిపారు. ఆయనతో పాటు నాయకులు బింకరి నారాయణ, సత్తయ్య ఉన్నారు.

రుణమాఫీలో గందరగోళం

- ఆందోళన చెందుతున్న రైతులు

నవతెలంగాణ-తిర్యాణి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంటరుణాల మాఫీ ప్రక్రియలో రైతుల సందేహాలను నివత్తి చేసే వ్యవస్థ లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రుణమాఫీ పొందిన రైతుల జాబితా తప్ప వ్యవసాయ శాఖ వద్ద మరే సమాచారం లేదు. రుణ మాఫీ అమలు ప్రక్రియలో తాజాగా వ్యవసాయశాఖను భాగస్వామిగా చేసిన ప్రభుత్వం... వ్యవసాయాధికారి (ఏవో), వ్యవసాయ విస్తీర్ణ అధికారి(ఏఈవో)లకు లాగిన్ ఇచ్చింది. రైతులు తమ క్లస్టర్ ఏఈవో లేదా మండల వ్యవసాయాధికారిని కలిసి ఆధార్ నంబర్ చెబితే రుణం మాఫీ అయ్యిందా ? లేదా? ఎందుకు కాలేదు అనే వివరాలను మాత్రం అందించే ఏర్పాట్లు చేశారు. ఒక వేళ రుణం మాఫీ కాని పక్షంలో ఆ సమస్యను ఎలా పరిష్కరించాలనే సమాచారం మాత్రం వ్యవసాయ శాఖ వద్ద లేదు. గతంలోనూ రుణమాఫీ కానివారి కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినా అది పూర్తిస్థాయిలో పనిచేయక పోవడంతో అనేక మందికి అర్హత ఉన్నా రుణమాఫీ ఫలాలు దక్కలేదు. ఇదిలా ఉండగా తొలి విడతలోనే రూ.లక్ష వరకు బకాయిలు ఉన్న అనేక మందికి పంట రుణాలు మాఫీకానట్లు తెలుస్తోంది. తమకు రూ.లక్ష లోపు రుణం ఉన్నా జాబితాలో తమ పేర్లు లేవని కొంత మంది రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయానికి, బ్యాంకులకు వెళ్లి ఫిర్యాదు చేసినా ఎక్కడ కూడా సరైన సమాధానాలు ఎవరు చెప్పడంలేదు. బ్యాంకుల నుంచి ప్రభుత్వం నేరుగా రైతుల వివరాలు, వారి అప్పు సమాచారాన్ని మాత్రమే సేకరించింది. రేషన్ కార్డును ఒకే కుటుంబంలోని రైతులు లబ్ది పొందుతున్నారా, లేదా అని ప్రామాణికంగా తీసుకున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరూ, ముగ్గురికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఉంటే వారి కుటుంబం మొత్తానికి రూ.2 లక్షల వరకు మాఫీ వర్తించాలి. కానీ ఒక్కరే కుటుంబ సభ్యుని పేరు జాబితాలో రావడం ఇతరుల పేర్లు లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కెరమెరి

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గుంపుల విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసులు ఆధ్వర్యంలో సాంఘిక దురాచారాలపైన కళజాత ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గుంపుల విజయ్ కుమార్ విద్యుత్ తీగలు, గంజాయి, సైబర్ నేరాలు, డయల్ 100, రోడ్డు ప్రమాదాల జాగ్రత్తలు తదితర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం కళాజాత బృందం సభ్యులు బాల్య వివాహాలు, సాంఘిక దురాచారాలపై ఆటపాటలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓగా మధుకర్ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారిగా మధుకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మధుకర్ పరిపాలన అధికారిగా బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్ ఏఓగా విధులు నిర్వహించిన రఫత్ హుస్సేన్ సాధారణ బదిలీల్లో భాగంగా మంచిర్యాల జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో మధుకర్ బాధ్యతలు స్వీకరించారు.

వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని బంబారా ఆశ్రమ పాఠశాలలో సీజనల్ వ్యాధుల నివారణపై ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి బుధవారం ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గురించి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల ఏవైనా సమస్యలుంటే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునంద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవ్‌రావు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ

నవతెలంగాణ-తిర్యాణి

మండలంలో మొత్తం 1248 మంది రైతులకు రుణమాఫీ అయినట్టు ఏఓ తిరుమలేశ్వర్ తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, వ్యవసాయాభివృద్ధి, రైతులపై ఉన్న ఆర్థిక భారాన్ని తగ్గించి సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం పంట రుణమాఫీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుందన్నారు. ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జబ్బులు జమచేస్తుందన్నారు. రైతులు రుణమాఫీ డబ్బులను వృథా చేయకుండా అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. రుణమాఫీ విడుదల కానీ రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ప్రతి రైతు రెన్యూవల్ చేసుకుంటేనే ఈ మాఫీ జమఅవుతాయని ఆయన తెలిపారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీఓ) రాంచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డిపో మేనేజర్ విశ్వనాథ అధ్యక్షతన నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు జాగ్రత్తగా నియమ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. ఆర్టీసీకి ప్రజల్లో ఒక మంచి పేరు ఉందని దానిని నిలబెట్టేలా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. డిపో మేనేజర్ విశ్వనాథ్ మాట్లాడుతూ ప్రమాద రహిత ప్రయాణాలు ఆర్టీసీతో సాధ్యమని, ప్రజల నమ్మకాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. వారం రోజులపాటు భద్రత వారోత్సవాల్లో భాగంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిసారిగా డిపోకు వచ్చిన డీటీఓను సన్మానించారు. అనంతరం సిబ్బందితో భద్రత వారోత్సవాల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌చార్జీ సరియా, గ్యారేజ్ ఇన్‌చార్జ్‌ఈ ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాస్యత ద్వారా ఆత్మవిశ్వాసంతో ముందడుగు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-కాసిపేట

అక్షరాస్యత ద్వారా ఆత్మవిశ్వాసంతో ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధించేందుకు ముందడుగు వేయవచ్చని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని మండలం దేవాపూర్ గ్రామంలోని పంచాయతీ కమ్యూనిటీ హాల్లో జిల్లా వయోజన విద్యాశాఖ, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ సంయుక్తగా 100 రోజులలో అక్షరాస్యులై కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న వారికి జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతిలతో కలిసి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యతతో నవసమాజ నిర్మాణం జరుగుతుందని, నాగరికత పెరుగుతుందని అన్నారు. కుట్టుశిక్షణ కేంద్రాలలో శిక్షణ పొందిన వారు శిక్షణను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. నేటి ఆధునిక విధానానికి అనుగుణంగా మెళకువలు నేర్చుకొని సమాజంలో ముందుకు సాగాలని, సంపూర్ణ అక్షరాస్యతకు సహకరిస్తున్న పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ అందించిన సహకారం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రెడ్డిమల్ల ప్రకాష్, డీఆర్‌పీలు పోకల వెంకటేశ్వర్లు, బండ శాంకరి, సమన్వయకర్తలు సంధ్య, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల



పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. బుధవారం మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మండల ప్రత్యేక అధికారి గంగారాంలతో కలిసి ఆకస్మికంగా సందర్శించి రిజస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ప్రజాపాలన కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిశీలనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్న, మండల పంచాయతీ అధికారి సర్దర్ అలీ పాల్గొన్నారు.

నిబద్ధతతో హోంగార్డులు విధులు నిర్వహించాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- హోంగార్డ్ అధికారులతో దర్బార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీసుల సమస్యలు పరిష్కరించడానికి తాను ఎప్పుడు సిద్ధంగా ఉంటానని నిబద్ధతతో విధులు నిర్వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని హెడ్ క్వార్టర్‌లో హోంగార్డ్ అధికారులతో దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారంలో తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు. కానిస్టేబుల్‌లతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వివిధ రకాల బందోబస్తులలో వీరి కృషి ఎంతో ఉందన్నారు. సంవత్సరానికి 12 వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పోలీసులకు ఇస్తున్న ఆరోగ్య భద్రత పథకం వలె హోంగార్డులకు కూడా ప్రయివేట్ సంస్థతో మాట్లాడి భద్రత పథకం కల్పించాలని అధికారులకు సూచించారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీఓ అంజన్న, ఆర్ఐ హోంగార్డ్ ఇన్‌చార్జి భరత్ భూషణ్, హోంగార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎంటీఎస్ ప్రకటించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

సమగ్ర శిక్ష, కేజీబీవీ, ఐటీడీఏ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎంటీఎస్(మినిమం టైం స్కేల్) ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని వేంపల్లి, వాగుమీర గూడ, సిర్పూర్-టి, లోనవెల్లి తదితర పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మేడి లక్ష్మీనారాయణ, చన్నపురే పురుషోత్తం ఆధ్వర్యంలో సభ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఐటీడీఏలో పని చేస్తున్న సీఆర్‌టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, మినిమం టైం స్కేల్ మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలకు పారిశుద్ధ కార్యక్రమం నిర్వహించడానికి స్వచ్ఛ కార్మికులను నియమించాలని, ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని, పాత బకాయిలను రద్దు చేసి,పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను మంజూరు చేయాలని, పీఆర్సీ 50 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర



అసోసియేట్ అధ్యక్షుడు దొంతి రాజు, వేణుగోపాల్ రావు, జాడిదేవాజీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందారపు ప్రకాష్, జావిద్ అహ్మద్, శ్రీకాంత్, సుజాత, మాధవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సుధా పాల్గొన్నారు.

సేఫ్టీ జీఎంను ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ అభివద్ధిలో, రక్షణలో అనేక మార్పులు తీసుకువచ్చిన సేఫ్టీ జీఎం గురవయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. పదవి విరమణ పొందుతున్న గురువయ్యను బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జీఎం సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో 42 సంవత్సరాల ఏడు నెలల సుదీర్ఘ సర్వీసు పనిచేసి పదవి విరమణ పొందుతున్న గురువయ్య అభినందనీయులని అన్నారు. పదవి విరమణ అనంతరం వారి శేష జీవితం ఆయురారోగ్య అష్టఐశ్వర్యాలతో తులతూగాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రాఘు కుమార్, ఇన్‌చార్జ్ ఎస్ఓ టు జీఎం గోపాల్ సింగ్, ఇందారం ఉపరితల ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏజెంట్లు ఏవీరెడ్డి, రాముడు, డీవై సీఎంఓ డా. పి రమేష్ బాబు, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, ఇన్‌చార్జి ఏరియా ఇంజనీర్ యాదయ్య, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మందమర్రి : ఉద్యోగుల రక్షణ చర్యలతో పాటు ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేసిన రక్షణ విభాగం కార్పొరేట్ జీఎం గురువయ్య సేవలు ఎనలేనివని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ కొనియాడారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న గురువయ్యను బుధవారం జీఎం కార్యాలయంలో జీఎం మనోహర్ అధ్యక్షతన సీనియర్ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎం రాజేశ్వర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజినల్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, డీజీఎం ఐ ఈడీ రాజన్న, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, ఏరియాలోని సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సీసీ కెమెరాలు ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, దీనికోసం ప్రతి దుకాణంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపారు. పట్టణ పరిధిలోని వివిధ రకాల వ్యాపారాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. దొంగతనాల కోసం అగంతకులు రెక్కీ నిర్వహించిన కూడా తెలుస్తుందన్నారు. వ్యాపారస్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

వాంకిడి : మండలంలోని ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దొంగతనాల నియంత్రణకు మండలకేంద్రంలోని వ్యాపార సంస్థ నిర్వాహకులు తమ దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని, దుకాణాలలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయడం వల్ల నేరాలను అరికట్టవచ్చున్నారు. ఏదైనా సంఘటనలు జరిగితే నేరస్తులను సులువుగా గుర్తు పట్టవచ్చున్నారు. బంగారం దుకాణం, కిరాణ దుకాణం, హోటళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్నారు.



సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూటీఎస్ ముందుంటుంది

- జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి

నవతెలంగాణ-దండేపల్లి

ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూటీఎస్ ముందుటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల, దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉమ్మడి సర్వీసులు సాధించడం కేవలం తమవల్లె సాధ్యమవుతుందని అన్నారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ సాధించడం ద్వారానే అర్హులైన స్కూలు అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ఎంఈఓ, డీఈఓ, జూనియర్ లెక్చరర్, డైట్ లెక్చరర్ వంటి పోస్టులకు పదోన్నతి ద్వారా పొందడానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర నాయకులు కలిశారని తెలిపారు. గత సంవత్సరం ఆగిపోయిన బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ విజయవంతం కావడానికి సంఘం పనిచేస్తుందని తెలిపారు. రిలీవ్ కానీ ఎస్జీటీ ఉపాధ్యాయులను రిలీవ్ చేసేందుకు ఉన్నతాధికారులతో తమ సంఘం చర్చలు జరుపుతుందని తెలిపారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా వారి జిల్లాలకు కేటాయించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కోటికేస్తూ ఆగిపోయిన ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బదిలీలు త్వరలో జరుగుతాయని జీరో వన్ జీరో పద్ధతి కింద జీతాలు వచ్చే విధంగా ఉన్నతాధికారులతో రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావణవేని రవి, మల్యాల మల్లేష్, సంఘం నాయకులు కొండు జనార్ధన్, అప్పల మనోహర్, పాత రమేష్, వరలక్ష్మి, రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన బైక్ యాత్ర



నవతెలంగాణ-సిర్పూర్(టి)

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేపట్టిన బైక్‌యాత్ర బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి దహెగం పవన్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల పరిష్కారం ధ్యేయంగా గత ఆదివారం కాగజ్‌నగర్‌లో మొదలుపెట్టిన బైక్ యాత్ర మంగళవారంకు సిర్పూర్ కు చేరుకుని ముగిసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హన్మకొండ నిరాహార దీక్షకు మద్దతు ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులనీ రెగ్యులర్ చేయాలని, లోపల ఎంటీఎస్ ఇచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. యాత్రలో దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతలమానేపల్లి, కౌటాల, సిర్పూర్, రెబ్బెన సీఆర్పీలు పాల్గొనగా కేజీబీవీ ఉద్యోగులు మద్దతు తెలిపారు.

ఎక్స్‌పో ట్రేడ్ షో విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 26, 27, 28 తేదీల్లో హైదరాబాద్ ఎల్బీనగర్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే ఫొటోగ్రాఫర్ల ఎక్స్ పో ట్రేడ్ షోను విజయవంతం చేయాలని ఆసిఫాబాద్, వాంకిడి ఫొటో వీడియో గ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. జిల్లా కేంద్రంలో ట్రేడ్ షో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రేడ్ షోలో ప్రతి ఏడాది అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలో భాగంగా కొత్త వరవడికి నాంది పలుకుతూ పలు రకాల టెక్నీషియన్లు, కెమెరాలు ప్రదర్శనలో పెడతారని, ఫోటో వీడియో గ్రాఫర్లకు కావాల్సిన అన్ని రకాల పరికరాలు దొరుకుతాయని, ప్రత్యేకంగా వాటి కొరకు వెళ్లాల్సిన అవసరం ఉండదని, ఒక రకమైన ఫొటోగ్రాఫర్లకు జాతర వంటి మహా కార్యక్రమని అన్నారు. భారీ సంఖ్యలో పాల్గొని రాష్ట్ర కమిటీ ఇచ్చే సందేశాన్ని తెలుసుకొని ఫొటోగ్రాఫర్ల మనుగడకై పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సమీర్, కోశాధికారి నీలి సతీష్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు వావిలాల రాజు, సభ్యులు వివేక్, రాజశేఖర్, అనిల్, లలిత్, అజయ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దీకొండ రమేశ్ తెలిపారు. ముసురు వర్షాల వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, పాత ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న నివాసల్లో ఉండే వారు కూడా అప్రమత్తంగా ఉండాలని, విస్తృతంగా వర్షాలు కురుస్తునందన వాగులు పొంగే రహదారుల్లో ప్రయాణాలు మానుకోవాలన్నారు. రైతులు వాగులు దాటేటప్పుడు, ప్రజలు విద్యుత్ పరికరాలను తాకేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. వరద ఉధృతితో రోడ్లు తెగిపోయినా, ఉధృతంగా ప్రవహించినా అక్కడికి ఆ గ్రామ ప్రజలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా లోపం ఉంటే వెంటనే విద్యుత్ శాఖ అధికారులక తెలియజేయాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

మహిళల రక్షణే షీ టీం లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల రక్షణే షీ టీం లక్ష్యమని షీ టీమ్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని చైతన్య కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి సమస్యలైన మహిళలు పోలీసులను సంప్రదించాలన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీం పనిచేస్తున్నట్టు తెలిపారు. చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా అత్యవసర సమయంలో డయల్ 100, షీ టీం నంబర్ 8712670564ను సంప్రదించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ శారద, జెండర్ స్పెషలిస్ట్ రాణి, సఖి మమత, కేస్ వర్కర్ శ్రీనిధి, కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, షీ టీం సభ్యులు సునీత, స్వప్న, విద్యార్థులు పాల్గొన్నారు.